క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గాంధీనగర్, రెడ్డిపురం, బుద్ధనగర్, యాదవనగర్, మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు, రాంపూర్ ప్రాంతాల్లో ఉదయం 9గంట నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఏనుమాముల మార్కెట్ రోడ్డు, రెడ్డి పాలెం, కొత్తపేట, దేశాయిపేట, ఎల్‌బీనగర్, బాలాజీనగర్, ఓసిటీ, లేబర్ కాలనీ, రాంకీ, ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ కాలనీ, హంటర్ రోడ్డు, బీట్‌బజార్, రామన్నపేట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. భీమారం, కోమటిపల్లి, భద్రకాళి కాలనీ, చింతగట్టు, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల, హసన్‌పర్తి ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు అమ్మవారికి కూరగాయల సమర్పణ

హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారి శాకంబరీ మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి అలంకరణ కోసం వివిధ రకాల కూరగాయలు, పండ్లను మహబూబాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో సమర్పించనున్నారని భద్రకాళి దేవాలయం ఈఓ శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. సేవా సమితి అధ్యక్షుడు గారెపల్లి నవీన్‌కుమార్ అధ్యక్షతన 2500మంది సభ్యులు శనివారం ఉదయం 9గంటలకు పోచమ్మ మైదాన్ నుంచి ర్యాలీగా భద్రకాళి దేవాలయానికి చేరుకొని అమ్మవారికి కూరగాయలు సమర్పిస్తారని వివరించారు.

నేడు రైల్వే పెన్షనర్లకు వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కార్యాలయం వద్ద ఏ టు జడ్ ఫార్మసీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కాజీపేట బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రావు, కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేపు దత్తక్షేత్రంలో గురుపౌర్ణమి పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగు రోడెండలోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని దత్తాత్రేయస్వామి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తైలాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, శ్రీగురుపాదుకా పూజ, గురుగీతా పారాయణం, ప్రత్యేక అర్చనలు జరుగుతాయని వరంగల్ దత్త జ్ఞానబోధ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

రేపు నేత్ర, అవయవ, శరీర దాన ఐక్యవేదిక సమావేశం

నయీంనగర్: నేత్ర, అవయవ, శరీర దాన ఐక్యవేదిక సమావేశాన్ని గోపాల్‌పూర్ క్రాస్ వద్ద ఆదివారం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కొండ్రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీర దాన ప్రాముఖ్యత, భావజాలాన్ని వ్యాప్తి చేయడం ఈ సమావేశ ఉద్దేశమని పేర్కొన్నారు. వివరాలకు 87905 48706 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకుల అందజేత




మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన నాయిని వెంకటమ్మ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను మడికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాజ్ శుక్రవారం అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా వెంకటమ్మకు చేయూత నిచ్చినట్లు ఆయన తెలిపారు.

అరుణాచలానికి బస్సు సర్వీస్

హన్మకొండ: అరుణాచలం గిరి ప్రదక్షిణకు భక్తులు వెళ్లే బస్సును ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను ప్రారంభించారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి ఈ బస్సు శుక్రవారం బయలుదేరింది. ఈ సందర్భంగా భక్తులతో ఆర్ఎం మాట్లాడారు. క్షేమంగా వెళ్లి రావాలని ఆకాంక్షించారు.

ప్రైవేట్ పాఠశాల సీజ్



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలను అధికారులు సీజ్ చేశారు. ఈ ఏడాది ఏకలవ్య పేరుతో స్థానికంగా పాఠశాలను ప్రారంభించారు. 1వ నుంచి 5వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే, ఆ పాఠశాల కారణంగా ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పడిపోతోందని జిల్లా విద్యాశాఖ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వంగపహాడ్‌లో ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి సీజ్ చేశారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

హన్మకొండ అర్బన్: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడంతో పాటు గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలను పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. బస్టాండ్ సమీపంలోని హనుమకొండ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెవాసులతో కలిసి శుక్రవారం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 77ఏళ్లు గడుస్తున్నా పేదలకు గూడు, కూడు, కూలి దొరకక అనేక కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 6 గ్యారెంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు



హన్మకొండ అర్బన్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, పేదలు

ఏశబోయిన శ్రీనివాస్, కొట్టిపాక రవి, దామెర సుదర్శన్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రొంటాల దేవా, నాయకులు గుంటి రాజేందర్, అమృతయ్య, శివ కుమార్, విజయలక్ష్మి, మంగ, మౌనిక, రాము, నారాయణ, అనిల్ పాల్గొన్నారు.

కాజీపేట తహసీల్ ఎదుట ధర్నా

కాజీపేట అర్బన్: కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



కాజీపేటలో వినతిపత్రం అందజేస్తూ..

ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకపోవడంతోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని గుర్తుచేశారు. నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మునిగాల భిక్షపతి, అశోక్, స్టాలిన్, రవి, శంకర్‌నాయక్, దీన, పూర్ణచందర్, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట



మడికొండ: టీచర్లు, పిల్లలతో రాధికగుప్తా

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని అంగన్‌వాడీ –3వ సెంటర్‌లో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా పాల్గొని పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. వారి పోషణ స్థితి, సెంటర్‌లోని వసతులను అంగన్‌వాడీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ వసంత, రాజ్యలక్ష్మి, లలిత, వెంకటలక్ష్మి, రాజమణి, ఆయా సరోజన, పిల్లలు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: గిరిప్రసాద్‌నగర్‌లో..

అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీ ప్రైమరీ విద్య

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ సెంటర్లలో నర్సరీ నుంచి యూకేజీ వరకు చిన్నారులకు చక్కటి విద్య, పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ తెలిపారు. అమ్మ బాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా వరంగల్ 37వ డివిజన్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్ కాలనీలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఆశాదేవి ఆధ్వర్యంలో చిన్నారులకు శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శోభ, రాజమణి, స్వర్ణలత, వహీదా, రమ, కవిత, రజిత, కవిత, కల్పన పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోండి

కాశిబుగ్గ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ డిప్యూటీ జోనల్ మేనేజర్ హితేంద్రనాథ్ శ్రీవాత్సవ సూచించారు. ఎస్‌బీఐ ప్రగతి ఇండస్ట్రియల్ ఎస్టేట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఓసిటీ మైదానంలో కిసాన్ మహ్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈమేరకు రైతులు, డ్వాక్రా గ్రూప్ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాత్సవ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని వర్గాలకు చేయూతనందిస్తోందని వివరించారు. అనంతరం కొంతమంది రైతులు, డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరు పత్రాలను అందజే



మాట్లాడుతున్న హితేంద్రనాథ్ శ్రీవాత్సవ

శారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రాజు, చీఫ్ మేనేజర్ సురేంద్రసింగ్ చౌహన్, అధికారులు రాజేష్, గోపికృష్ణ, మధుకర్‌గౌడ్, విఠల్ కుమార్, శ్రీనివాస్, కరుణ పాల్గొన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ఖిలా వరంగల్: ఆషాఢ మాసం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామ చంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని లలితాదేవి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి వెంకటేశ్వరచార్యులు, ఆలయాభివృద్ధి కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో శ్రీలలితాదేవి అమ్మవారికి శుక్రవారం పూజలు చేసి సంపూర్ణ శాకంబరీదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, ఆడెపు శ్యామ్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో అభిషేకం

మడికొండ: ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా మడికొండలోని మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ మంత్రోచ్ఛరణ మధ్య పంచామృత అభిషేకం చేసి అనంతరం అమ్మవారిని కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించారు. కార్యక్రమంలో జిజియాబాయి, రాజేశ్వరి, విజయ, బుజ్జి, శారద, శివశంకర్, స్వప్న, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో..

హసన్‌పర్తి: శాకంబరీ ఉత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం పంచామృతంతో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్, సంఘం ఉపాధ్యక్షుడు జితేందర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు మేకల హరిశంకర్, దాసరి రాజు పాల్గొన్నారు.

చదువుతోనే ఉపాధి అవకాశాలు

రామన్నపేట: చదువుతోనే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి సూచించారు. నగరంలోని ఎల్‌బీ కళాశాలలో ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ మంచిగా చదువుకున్నప్పుడే మంచి ఉద్యోగాలను పొంది ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని వివరించారు. జెన్‌ప్యాక్ట్, క్యూకనెక్ట్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, తదితర కంపెనీలు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశాయి. మెగాజాబ్ మేళాలో ఎల్‌బీ కళాశాలతో పాటు పలు కళాశాలలకు చెందిన సుమారు 550 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు వివరించారు. అనంతరం జిల్లా ఉపాధి అధికారి మాధవికి



మాధవిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మెమెంటో అందించి సన్మానించారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ హెచ్ఆర్ రాఘవ, కళాశాల ప్లేస్‌మెంట్ కన్వీనర్ శ్రుతి, సభ్యులు రాజేశ్వర్‌రావు, రాణి, విజయ్, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



సురేష్‌ను సన్మానిస్తున్న అద్దె బస్సుల యజమానులు

హన్మకొండ: ఉద్యోగులకు బదిలీలు సహజమని ఆర్టీసీ వరంగల్ –2 డిపో మేనేజర్ జి.సురేష్ అన్నారు. కరీంనగర్ జిల్లా బస్‌స్టేషన్‌కు బదిలీ అయిన వరంగల్ – 2 డిపో మేనేజర్ జి.సురేష్‌ను ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం సురేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు బాధ కలిగించినా బాధ్యతతో వెళ్లక తప్పదన్నారు. అద్దె బస్సుల యజమానుల నుంచి సంపూర్ణ సహకారం లభించిందని గుర్తుచేశారు. సమన్వయం చేసే క్రమంలో ఇబ్బందులు ఎదురైతే వాటిని వ్యక్తిగతంగా తీసుకోకుండా సంస్థ పరిరక్షణ కోసం తీసుకున్నట్లుగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్ రెడ్డి, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి, డిపో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శులు ఫర్వేజ్, కె.సదానందం, సభ్యులు హబీబుద్దీన్, షఫి, బి.లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ జాబ్‌మేళాకు విశేష స్పందన



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన అప్రెంటిషిప్ కమ్ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. 12మంది ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా ఆర్‌డీఎస్‌డీ ఈ – ట్రెనింగ్ ఆఫీసర్ విజయకుమార్ మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. ప్రోత్సాహకంగా ప్రభుత్వ సాంకేతిక శిక్షణ నైపుణ్య సంస్థ ద్వారా రూ.7 వేలు ఉపకార వేతనాలు కూడా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో హనుమకొండ డీఐఈఓ గోపాల్, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ రీడర్ రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అప్రెంటిషిప్ మేళా కోకన్వీనర్ మాధవరావు, జనగామ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దివాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారులపై గస్తీ ముమ్మరం చేయాలి

మామునూరు: వరంగల్ - ఖమ్మం ప్రధాన జాతీయ రహదారిపై పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు. బొల్లికుంట క్రాస్ రోడ్డు సన్‌షైన్ బార్ ఎదురుగా బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని రోడ్ అనాలసిస్ గ్రూపు (ర్యాగ్) టీమ్ సభ్యులు, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ తిరుపతి శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన తీరును ర్యాగ్ కమిటీ సభ్యులు, ఏసీపీకి సీఐ శ్రీనివాస్ వివరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై ఏసీపీ స్పందించి మాట్లాడారు. జాతీయ రహదారులపై గస్తీని ముమ్మరం చేస్తూ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆర్టీఏ జంక్షన్ సమీపం నుంచి ఐనవోలు క్రాస్ వరకు ప్రమాద జోన్‌గా గుర్తించి తక్షణమే రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ఏసీపీ తిరుపతి సూచించారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతి

సమాజంపై అవగాహన కలిగిఉండాలి



ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబును సన్మానిస్తున్న విద్యాసాగర్, ప్రతిభారాథోడ్

హన్మకొండ: సమాజంపై, సమస్యలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పేదలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత న్యాయ విద్య అభ్యసించే విద్యార్థులపై ఉందని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రమేష్ బాబు సూచించారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదర్శ న్యాయ కళాశాల నూతన విద్యార్థుల ఫ్రెషర్స్ డే, సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత కలిగిన వ్యవస్థ అని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సినీనటుడు ఎండీ.షఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభారాథోడ్, కేయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, కేయూ పాలక మండలి సభ్యుడు సుదర్శన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీకి సన్మానం

హన్మకొండ: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ డీఎస్ వెంకన్నను బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. గిరిజన సంక్షేమ శాఖ వరంగల్ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి పొంది హైదరాబాద్‌కు బదిలీ అయిన వెంకన్నను అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్.నాయక్, ప్రతినిధులు సామేల్ నాయక్, జి.సజ్జన్ నాయక్ హనుమకొండలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పి.నంద నాయక్,



వెంకన్నను సన్మానిస్తున్న ప్రతినిధులు

బి.సోమ్లా నాయక్, సంగీత్ సాగర్, జి.మదన్ నాయక్, జి.రాజేష్ నాయక్, కే.శ్రీను నాయక్, డి.రఘురాం నాయక్, బి.భాస్కర్ నాయక్, ఎ.చిరంజీవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ అకాల మరణం విచారకరం

వరంగల్: సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ అకాల మరణం అందరని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆయన మృతిపై కేంద్ర కమిటీ విచారం వ్యక్తి చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రశేఖర్ కమ్యూనిస్టు ఉద్యమ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చారని, బాల్యం నుంచే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై విద్యార్థి ఉద్యమం నుంచి 1975 తర్వాత కొంతకాలం దళాల్లో పనిచేశారని గుర్తుచేశారు.

ఖిలా వరంగల్: సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు, కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్‌కేఎం) తెలంగాణ ఇన్‌చార్జ్ రాయల చంద్రశేఖర్ మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటని పార్టీ మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. పడమరకోట జంక్షన్‌లోని అమరవీరుల స్తూపం వద్ద చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మైదం పాణి, సాబిరికాని మోహన్, బైరబోయిన ఐలన్న, ఇనుముల కృష్ణ, కిషోర్, రాజేందర్, బాబు, జనార్దన్, కొమురయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆటో డ్రైవర్లను ఆదుకోండి

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇచ్చి ఆదుకోవాలని తాడు ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి రాజు కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో రూ.వేయి కోట్లతో ఆటోడ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న ఏకశిల పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నవీన్‌కుమార్, గౌని రాజు, కరుణాకర్, అంజయ్య పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ బాలయ్యకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం పరిశోధకుడు, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బర్ల బాలయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. రామచంద్రమౌళి కథలు సమగ్ర విశ్లేషణ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బర్ల బాలయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీదేవి పర్యవేక్షణలో బాలయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆయన కేడీసీలో తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఖిలా వరంగల్: వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు పరిసరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఉప్పరోని కుంటలో ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం రవి, శివకుమార్ మాట్లాడుతూ నీటి నిల్వతో దోమలు ఎక్కువై రోగాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో శాంతి, ప్రశాంత్, మహేష్‌కుమార్, ప్రదీప్‌కిరణ్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శోభాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, అధ్యాపకులు మల్లారెడ్డి, వీరాంజనేయులు, సుధాకర్, నరేష్, రజిత, లక్ష్మి, ఎర్ర ప్రవీణ్ పాల్గొన్నారు.

కొత్త రకం మోసాలకు సైబర్ నేరగాళ్ల ప్లాన్

కాజీపేట రూరల్: సైబర్ నేరగాళ్లు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారని కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈక్రమంలో ప్రజలు సైబర్ నేరగాళ్ల మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

హన్మకొండ అర్బన్: మాజీ మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్, సర్వోదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలను ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అందించారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ సుప్రియ దేశ్‌పాండే, అనిరుద్ దేశ్‌పాండే, వినాయక హాస్పిటల్ చైర్మన్ రాజు, బీజేపీ జిల్లా ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నాగపురి అశోక్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, శ్రీకాంత్, నాయకులు యాదగిరి, ప్రవీణ్, నరేష్, శివ, సంతోష్, యూత్ అధ్యక్షుడు బాబీ, ఓబీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలు

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై అఖిల భారత విద్యార్థి పరిషత్ నిరంతరం పోరాడుతోందని ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుగు శ్యామ్ తెలిపారు. హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి సుజిత్ మాట్లాడారు. అనంతరం ఏబీవీపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన నగర అధ్యక్షుడిగా సంపత్, నగర కార్యదర్శిగా అరుణ్‌ను ఎన్నుకున్నారు. పూర్వ నగర అధ్యక్షుడు కొత్తపెల్లి సుధాకర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరెపెల్లి సుజిత్ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న ఐటీఐ కళాశాల భవనాలు

విద్యారణ్యపురి: వరంగల్ ములుగురోడ్డులోని ఐటీఐ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడుతున్నా పట్టించుకోవడం లేదని డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) రాష్ట్ర కోకన్వీనర్లు ఉప్పుల శివ, నాగరాజు విమర్శించారు. కళాశాలను శుక్రవారం సందర్శించి వారు మాట్లాడారు. భయంభయంగా విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారని చెప్పారు. కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజు, సాగర్, అనిల్ పాల్గొన్నారు.

దీక్షకు సంబంధం లేకున్నా అరెస్ట్ చేస్తారా?

విద్యారణ్యపురి: గ్రూప్ – 2, 3 పరీక్షలు వాయిదా వేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో చేపట్టిన సత్యగ్రహ దీక్షలో పాల్గొనకున్నా తమను అరెస్టు చేయడం శోచనీయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ శుక్రవారం తెలిపారు. పోలీసులు తనను అరెస్టు చేసి కేయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు.

కేయూ బీఆర్ఎస్‌వీ ఇన్‌చార్జ్ అరెస్ట్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్‌వీ ఇన్‌చార్జ్ జట్టి రాజేందర్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామంలోని స్వగృహంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు.

చెట్లు మానవ జీవితంలో అంతర్భాగం

హసన్‌పర్తి: చెట్లు మానవ జీవితంలో అంతర్భాగమని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరావు అన్నారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల నేషనల్ గ్రీన్ కార్ప్ ఆధ్వర్యంలో పురుషోత్తం పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం ఆకుతోట రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్, ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో 'గ్రీన్ ఇండియా మిషన్'

రామన్నపేట: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా హంటర్‌రోడ్డు ప్రాంతంలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాఠశాల ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు స్మార్ట్ లర్నింగ్ ప్రోగ్రాం ద్వారా ప్రతీనెలా ఒక కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పాఠశాల చైర్మన్ ఎం.శ్రీధర్, డైరెక్టర్ ఎం.శ్రీవిద్య, అకడమిక్ కోఆర్డినేటర్ శివకోటేశ్వర్‌రావు, డీన్ రంజిత్, ఐపీఎల్ ఇన్‌చార్జ్ సన్నీ పాల్గొన్నారు.